క్లుప్తంగా...

నేడు డయల్ యువర్ డీఎం

అఫ్జల్‌గంజ్: ఆర్టీసీ సమస్యలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ డిపో–1 మేనేజర్ బీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని రాయచూర్, కర్నూల్, నంద్యాల, బెంగళూరు, సేడం, యాదగిర్, గుల్బర్గా, ఆదిలాబాద్, షోలాపూర్, నాగపూర్ తదితర రూట్లల్లో తిరిగే బస్సులకు సంబంధించిన సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఫోన్ నెంబర్ 9959226248లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఓ ప్రకటనలో తెలిపారు. తీగలకుంట, ఎంసీహెచ్ కాలనీ తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. భాయిస్ టౌన్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. మషారత్ ఫంక్షన్ హాల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, తానాజీ నగర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఓడిన్ స్కూల్‌లో బూట్‌క్యాంప్ ప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

అబిడ్స్: ఓడిన్ స్కూల్ ఆధ్వర్యం పర్ఫార్మెన్స్ మార్కెటింగ్ బూట్‌క్యాంప్ ప్రారంభించారు. ఉద్యోగులు, బిజినెస్ ఓనర్లు, డిజిటల్ మార్కెటర్లు, తమ అభివృద్ధిని పెంచుకోవడానికి వివిధ డిజిటల్ ప్లాట్‌ఫారంలపై శిక్షణ ఇచ్చే విధంగా బూట్‌క్యాంపు ప్రారంభించారు. సీఈఓ విజయ్ పసుపులేటి మాట్లాడుతూ.. డేటా సైన్స్, వెబ్ డెవలప్‌మెంట్, బూట్‌క్యాంప్‌ల విజయం త్వరలోనే కొనసాగుతుందన్నారు. ఓడిన్ స్కూల్ వేదికగా మార్కెటింగ్ పర్ఫార్మెన్స్ నైపుణ్యాలు పరిజ్ఞానంతో శిక్షణ ఇస్తామన్నారు.

సన్మానం



దేవర శ్రీనివాస్‌కు మెమొంటో అందిస్తున్న యాదవ సంఘం నాయకులు

గోల్కొండ: వినాయక మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణతో పాటు నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించడం గొప్ప విషయమని కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్‌కుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద యాదవ సంఘం, హిందూ జాగృతి వారు వినాయక మండపాల ప్రతినిధులను సన్మానించారు. ప్రేమ్‌కుమార్ యాదవ్, గంగాధర్, బిజ్వర్‌సింగ్, మురళీకృష్ణగౌడ్, నామ యాదగిరినేత, శ్రీశైలం తదితరులున్నారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో 'ఏక్ తారీఖ్ ఏక్ గంట'

చార్మినార్: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల1న స్వచ్ఛతా దివస్ నిర్వహిస్తున్నామని మ్యూజియం డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆదేశాల మేరకు ఏక్ తారీఖ్ ఏక్ గంటలో భాగంగా ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు గార్బేజ్ క్లీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ ఇన్ అండ్ ఎరౌండ్ సాలార్‌జంగ్ మ్యూజియం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రెజ్లింగ్‌లో సత్తాచాటిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

విజయనగర్ కాలనీ: విద్యార్థులను సరైన విధంగా ప్రోత్సహించి శిక్షణ ఇప్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని సబ్జిమండీలోని వి ద స్కూల్ కరస్పాండెంట్ పి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. గత వారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రెజ్లింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ కేటగిరిలలో సత్తాచాటారు. వారిని శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. 30 కేజీల విభాగంలో పూజా, 58 కేజీల విభాగంలో నీరజ, 62 కేజీల విభాగంలో వి.నిషా కాంస్య పతకాలు పొందారని అదే విధంగా అండర్–17 విభాగంలో వైష్ణవి బంగారు పతకం సాధించగా మాధవి సిల్వర్ మెడల్, శిరీషా సిల్వర్ మెడల్‌లను సాధించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.ప్రసన్నలక్ష్మి, అధ్యాపకులు, కోచ్ మౌనిక పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ గుండె దినోత్సవం

అబిడ్స్: గుండెను ప్రతిఒక్కరూ ఆరోగ్యకరంగా ఉంచుకున్నప్పుడే మనిషి జీవితం పదిలంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏకే.ఖాన్ పేర్కొన్నారు. ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంజే మార్కెట్‌లోని కేర్ ఆస్పత్రి వారు వింటేజ్ కార్, బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏకే ఖాన్ మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ ప్రతిరోజు వాకింగ్, కొంత సేపు అయినా యోగాసనాలు చేసి ఆరోగ్యకరంగా ఉండాలన్నారు. కేర్ ఆస్పత్రి గుండెపట్ల ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆస్పత్రి హెచ్‌సీఓఓ సయ్యద్ కమ్రాన్ హుస్సేన్, డాక్టర్ నిర్మల్‌కుమార్, డాక్టర్ అమన్ సల్మాన్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కేవీ.రాజశేఖరరావు, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ అమీనుద్దీన్ ఒవైసీ, డాక్టర్ వెంకటేష్ కుమార్, మార్కెటింగ్ హెడ్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రారంభించిన వింటేజ్ కార్ బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్

ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో..

నాంపల్లి: గుండె ఆరోగ్యవంతంగా ఉండటానికి హైపర్ టెన్షన్, అధిక బరువు, ధూమపానం, చక్కెర వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలని బాసర ఐఐటీ మాజీ వైస్ చాన్స్‌లర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రపంచ గుండె పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గుండె వ్యాధులు పరిరక్షణ అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉస్మానియా ఆస్పత్రి కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ అధిపతి ప్రొఫెసర్ సయ్యద్ ఇమాముద్దీన్ మాట్లాడుతూ..గుండె ఆరోగ్యంగా ఉండాలంటే జీవన శైలిని మార్చుకుని నిత్యం వ్యాయామం, కాలినడక, యోగాతో పాటు నిద్ర ఎనిమిది గంటలకు తక్కువ కాకుండా నిద్రపోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రొఫెసర్ ఇమాముద్దీన్ 20 ఏళ్లలో 21వేల గుండె ఆపరేషన్లు నిర్వహించిన వైద్యులుగా ప్రఖ్యాతి పొంది ఇతర డాక్టర్లతో కలిసి ఆయన చేసిన ఆపరేషన్ల సంఖ్య 50 వేలు దాటినందుకు ఈ యేడాది ఉత్తమ కార్డియాలజిస్ట్ అవార్డు–2023ను అందజేసి సత్కరించారు. డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, డాక్టర్ మహ్మద్ అక్బర్ అలీ, డాక్టర్ వరలక్ష్మి, ఉదయశ్రీ, డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. సభానంతరం విద్యార్థులతో కలిసి డాక్టర్ అశోక్ ర్యాలీని ప్రారంభించారు.

రెనోవా ఆస్పత్రిలో..

గోల్కొండ: ఆహారపు అలవాట్లను మార్చుకుంటే గుండెజబ్బులతో పాటు ఎన్నో రకాల వ్యాధులకు చెక్ పెట్టవచ్చునని లంగర్‌హౌజ్‌లోని రెనోవా ఆస్పత్రి సీఓఓ రవీంద్రనాథ్ గరగ అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వద్ద బెలూన్‌లను గాలిలోకి వదిలి బాపుఘాట్ వరకు వాకాథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండెకు సంబంధించిన వ్యాధులను సరైన సమయంలో గుర్తిస్తే వాటిని నివారించవచ్చునన్నారు. డాక్టర్ మహ్మద్ సోయబ్ అహ్మద్, ఆస్పత్రి వైద్యులు, బాపుఘట్ వాకర్స్ పాల్గొన్నారు.

ఎంజీబీఎస్‌లో..

అఫ్జల్‌గంజ్: ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకొని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఉచిత బీపీ, పల్స్ టెస్ట్ కియోస్క్‌ను ప్రారంభిస్తున్నట్లు టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఎంజీబీఎస్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్య జీవనం కోసం, ఆరోగ్యకరమైన గుండె అవసరం అనే స్ఫూర్తితో కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఎంజీబీఎస్‌లో ఈడీ పురుషోత్తం, ఆర్‌ఎం శ్రీధర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు.





బెలూన్‌లు ఎగరవేస్తున్న సిఓఓ రవీంద్రనాథ్, ఎంజీబీఎస్‌లో టెస్ట్ సెంటర్‌ను ప్రారంభించిన ఈడీ పురుషోత్తం, ఆర్‌ఎం శ్రీధర్ తదితరులు

'డబుల్' ఇళ్ల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

నాంపల్లి: హైదరాబాద్ జిల్లా పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ స్థానాల్లో నిబంధనలను ఉల్లంఘిస్తూ ముస్లిం మైనార్టీ వర్గాలకు కేటాయించిన ఇళ్లను వెంటనే రద్దు చేసి అర్హులైన నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలంటూ హైదరాబాద్ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) చట్టం సభ్యులు బత్తుల రాంప్రసాద్, బోయిన ఎల్లేష్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ)కు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు చేయడం జరుగుతోందని, అందులో ప్రధానంగా హైదరాబాద్ జిల్లా రాష్ట్రంలోని మిగతా జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తూ పూర్తి పారదర్శకంగా, ఎన్నడూ లేని విధంగా ఎన్‌ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్ ర్యాండమైజేషన్ పద్ధతిలో ఇళ్ల పంపిణీ చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని 15 నియోజకవర్గాల్లోని నాంపల్లి, కార్వాన్, గోషామహల్, మలక్‌పేటలో ఎస్సీ, ఎస్టీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు.



డీఆర్‌ఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బత్తుల రాంప్రసాద్, బోయిన ఎల్లేష్ మాదిగ

6న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆత్మీయ సమ్మేళనం



గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: అక్టోబర్ 6న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భారీ ఎత్తున ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నగర గ్రంథాలయ మాజీ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. దళితవాడలలో నిద్ర, జాబ్‌మేళా, ఉచిత డిగ్రీ సీట్లు ఇవ్వడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్లు ఆయన వివరించారు. బీఆర్‌ఎస్ అధిష్టానం టికెట్ ఇస్తే బీజేపీని ఓడించి బంగారు పల్లెంలో పెట్టి కానుగా ఇస్తానని ఆయన అన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో దాదాపు 10 వేల మంది వస్తారని, వారందరికీ వరల్డ్ ఫేమస్ ప్యారడైజ్ బిర్యాని ఏర్పాటు చేయిస్తున్నట్లు గడ్డం శ్రీనివాస్ యాదవ్ వివరించారు.

పోలీసుల అత్యుత్సాహంతో ధ్వంసమైన వినాయకుడి విగ్రహం

చర్యలు తీసుకోవాలని డీసీపీకి ఫిర్యాదు

సంతోష్‌నగర్: ఊరేగింపు సందర్భంగా వినాయకుడి విగ్రహాన్ని లారీలో ఎక్కించి సమయంలో పోలీసుల అత్యుత్సాహంతో కిందపడి ధ్వంసమైందని చంద్రయ్యనగర్ భాగ్యనగర్, శ్రద్ధాబాద్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, శివాజీ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు అనూప్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన అసోసియేషన్ సభ్యులతో కలిసి సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్.రూపేశ్‌ను కలిసి వినాయకుడి ధ్వంసానికి కారణమైన ఇన్‌స్పెక్టర్ మల్లేష్, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ..వినాయక నిమజ్జన సమయంలో పోలీసులు తమను తిడుతూ దుర్భాషలాడరని.. నిమజ్జనం ముగిసిన అనంతరం మాపై కేసులు పెడుతామని బెదిరించారని వాపోయారు. దీనికి కారణమైన సీఐ మల్లేష్, పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు.

కిందపడిన సమయంలో అక్కడ లేము: ఇన్‌స్పెక్టర్ మల్లేష్..

వినాయక ఉత్సవ సమితి సభ్యులు నిమజ్జనోత్సవం సందర్భంగా వినాయకుడిని లారీలో ఎక్కించే సమయంలో అజాగ్రతగా ఉండటంతో ఈ ఘటన జరిగిందని..ఘటన జరిగిన సమయంలో తాము అక్కడ లేమని ఐఎస్‌సదన్ ఇన్స్పెక్టర్ మల్లేష్ తెలిపారు. వినాయకుడిని లారీలో ఎక్కించే సమయంలో కిందపడిందన్న విషయాన్ని తెలుసుకున్న అనంతరం తాము అక్కడికి వెళ్లి చర్యలు తీసుకున్నామే కానీ.. తాము ఉత్సవ సమితి సభ్యులకు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదన్నారు.



సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్.రూపేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

వినాయక నిమజ్జనంలో అపశృతి

36 మందికి ఉస్మానియాలో చికిత్స

అఫ్జల్‌గంజ్: వినాయక ఉత్సవాల్లో అనుకొని ఘటనలు జరిగితే వెంటనే స్పందించేందుకు వీలుగా ఉస్మానియా ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... గురువారం జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా దాదాపు 36 మంది వివిధ గాయాలపాలై ఉస్మానియాకు వచ్చారని అందులో చాంద్రాయణగుట్టకు చెందిన ఓ యువకుడికి తీవ్ర గాయాలు కాగా అతడిని ఇన్‌వార్డులో చేర్చుకొని వైద్య సేవలు అందించామన్నారు. మిగతావారు అవుట్ పేషంట్ విభాగంలో వైద్య సేవలు పొంది వెళ్లారన్నారు. ఇన్‌వార్డులో చేర్చుకున్న యువకుడిని సైతం వైద్య సేవలందించి ఇంటికి పంపించామని తెలిపారు.

మరదలిపై అసభ్య ప్రచారం చేసిన వ్యక్తికి జైలు

సంతోష్‌నగర్: మరదలిపై అసభ్య ప్రచారం చేస్తున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు 6 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మయన్మార్‌కు చెందిన మహ్మద్ హరూన్ 12 ఏళ్ల క్రితం కుటుంబంతో నగరానికి వలస వచ్చి కంచన్‌బాగ్ స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌బాబానగర్ సీ–బ్లాక్ ప్రాంతంలో ఉంటున్నాడు. హరూన్‌తో పాటు అతని అన్న మహమ్మద్ ఆలం (53) ముగ్గురు భార్యల్లోని చిన్న భార్య సాబు నహార్‌తో నివాసముంటున్నారు. కాగా ఇంట్లో సాబు నహార్ హరూన్ భార్య తరుచూ గొడవపడేది. ఇందులో భాగంగా మహ్మద్ ఆలం హరూన్ భార్య (మరదలు) గుణం బాగాలేదని స్థానికంగా ప్రచారం చేశాడు. దీనిపై హరూన్ తన అన్న మహ్మద్ ఆలంపై కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మహ్మద్ ఆలంను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని శుక్రవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా..మెజిస్ట్రేట్ ఆలంకు 6 రోజుల జైలు శిక్ష విధిసూ తీర్పునిచ్చారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విజయనగర్‌కాలనీ: గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్, ఎస్‌ఐ.అంబేడ్కర్ తెలిపిన వివరాల ప్రకారం..తాళ్లగడ్డలో ఓ వ్యక్తి (40) అపస్మారక స్థితిలో రోడ్డుపక్కల పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తిని ఉస్మానియా ఆస్పత్రికి వైద్య చికిత్సల నిమిత్తం తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడి సంబంధికులు టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో, 87126 60446లో సంప్రదించాలని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్, ఎస్‌ఎస్‌ఎఫ్ కాలనీల్లో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ఏ మేరకు పూర్తయ్యాయే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడితే ఏ మాత్రం సహించనని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి మళ్లీ టెండర్లు కేటాయించవద్దని అధికారులను కోరుతానన్నారు. ప్రజాధనంతో జరిగే పనులు ప్రజలకు లాభదాయకంగా ఉండాలని వారికి సమస్యలు మళ్లీ ఎదురవకుండా చూడాల్సిన బాధ్యత తనపై ఉందని అన్నారు. ప్రస్తుతం కార్వాన్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అధునాతన డ్రైనేజీలు వేయడం జరుగుతుందని పాత కాలం నాటి డ్రైనేజీ లైన్‌లకు పూర్తిగా స్వస్తిచెప్పి బాక్స్ టైప్ డ్రైనేజీలను వేస్తున్నామన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి డివిజన్ మజ్లిస్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, సయ్యద్ జబ్బార్, మజీద్ తదితరులున్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

సిబ్బంది సహకారంతో ప్రశాంతంగా నిమజ్జనం

అబిడ్స్: అందరు పోలీస్ సిబ్బంది సహకారంతో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగిందని అబిడ్స్ డివిజన్ ఏసీపీ ఆకుల చంద్రశేఖర్ పేర్కొన్నారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజుతో కలిసి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ..72 గంటలకు పైగా నిరంతరం పోలీస్ సిబ్బంది విజయవంతంగా విధులు నిర్వహించారన్నారు. కమిషనర్ సీవీ ఆనంద్, డీసీపీ వెంకటేశ్వర్లు కూడా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారన్నారు. సిబ్బంది అంతా కలిసికట్టుగా విధులు నిర్వహించి గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా, విజయవంతంగా చేపట్టారని కొనియాడారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా, ఎస్‌ఐలు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు

మహ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి దూత



మతీన్ ఆలీషా ఖాద్రీ

గోల్కొండ: మహ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి దూత అని ఆల్ ఇండియా హీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. శుక్రవారం గోల్కొండ మహ్మదీ లైన్స్‌లో జరిగిన మిలాద్–ఉన్–నబీ వేడుకల సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రవర్త మహ్మద్ జన్మదినాన్ని మిలాద్–ఉన్–నబీగా ముస్లింలు జరుపుకుంటున్నారన్నారు. ప్రవక్త మహ్మద్ జననం కంటే ముందు ముస్లింలు ఎన్నో దూరాచారాలను పాటించే వారని విగ్రహ పూజ కూడా ఆ కాలంనాటి ముస్లింలు అమలు పరిచేవారన్నారు. ఆయన ప్రచారంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిని ప్రజల నుంచి అవమానాలు కూడా సహించారని ఆయన అన్నారు. ప్రవక్త మహ్మద్ బోధనలు ఎప్పటికి ఆచరణీయమేనని ఆయన అన్నారు. ప్రవక్త మహ్మద్ ఇతర మతాల వారిని ఏనాడు దూషించలేదని అందరిని ఆయన ప్రేమతో పలకరించే వారని ఆయన అన్నారు. నేడు మనమంతా ఆయన జీవితం నుంచి సత్యాలను గ్రహించి హింసను విడనాడాలని ఆయన ప్రబోధించారు. ఈ కార్యక్రమంలో మహ్మదీ లైన్స్ 53వ సీరత్ కమిటీ అధ్యక్షుడు గౌస్ ఖాద్రీ, మాజీ ఎంపీ ఉబేద్‌ఉల్లా, ఖారీనూర్ పాల్గొన్నారు.

తెల్లవారు జామున 3 గంటలకు ముగిసిన శోభాయాత్ర

చార్మినార్: పాతబస్తీలో నిమజ్జనోత్సవ ప్రధాన ఊరేగింపు శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు ముగిసింది. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా పాతబస్తీ నుంచి కొనసాగిన ప్రధాన ఊరేగింపు శోభాయాత్రకు పాతబస్తీలో అదనపు బలగాలతో గట్టి బందోబస్తు నిర్వహించారు. శాలిబండ, నయాపూల్ వద్ద జరిగిన చిన్న చిన్న ఘటనలు తప్పా..శోభాయాత్ర ప్రశాంతంగా ముగిసింది. పాతబస్తీ శివారు ప్రాంతమైన బాలాపూర్ నుంచి బయలుదేరిన ప్రధాన శోభాయాత్ర బార్కాస్, చాంద్రాయణగుట్ట, శాలిబండ, మక్కా మసీదు, చార్మినార్, మదీనా, నయాపూల్, మొజంజాహీ మార్కెట్ ద్వారా హుస్సేన్ సాగర్ వరకు కొనసాగింది. దక్షిణ మండలం శాంతి సంఘం సభ్యుడు చార్మినార్ వద్ద తిష్ట వేసి శోభాయాత్ర ప్రశాంతంగా ముగియడానికి పూర్తిగా సహకరించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

ఆలస్యంగా ముగింపు

ఈసారి లడ్డూ వేలం అనంతరం సాగర్ తీరానికి తరలిన బాలాపూర్ వినాయకుడు వడివడిగా ముందుకు దూసుకు వచ్చి మధ్యాహ్నం 2.30 గంటలకు చార్మినార్ కట్టడాన్ని దాటి వెళ్లింది. గతేడాదితో పోల్చితే ఈసారి బాలాపూర్ అతి వేగంగా పాతబస్తీ దాటి ముందుకు వెళ్లినప్పటికీ.. గురువారం సాయంత్రం 5–6 గంటల వరకు కూడా దక్షిణ మండలంలోని వివిధ ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలు అధిక సంఖ్యలో చార్మినార్‌కు తరలిరాలేదు. దీంతో గత ఏడాదితో పోల్చితే ఈసారి పాతబస్తీలో శోభాయాత్ర ఆలస్యంగా ముగిసింది.

ఏఎన్‌ఆర్ పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: పద్మవిభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు నేటితరం నటీనటులకు ఆదర్శప్రాయుడని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సిల్‌వెల్ కార్పొరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏఎన్‌ఆర్ సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏఎన్‌ఆర్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పలువురు గాయకులకు, నటులకు ఏఎన్‌ఆర్ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుసుమ భోగరాజు, శృతిలయ ఆర్ట్స్ కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాల గ్రహీతలతో దామోదర్‌గుప్తా తదితరులు

పోటాపోటీగా లడ్డూల వేలం



లడ్డూ వేలంలో కార్వాన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ



ఇమాంపురా ఎన్‌బీఎస్‌లో .. అధ్యక్షుడు మదిర సత్యనారాయణ తదితరులు



శ్రీ వీర వినాయక బాలభక్త సమాజ్ లడ్డూ వేలంలో నిర్వాహకుడు దిలీప్‌కుమార్



వినాయక్‌నగర్‌లో రూ.1.80 లక్షలకు లడ్డూ దక్కించుకున్న ఆడాల నిఖిల్ కుమార్



జంగమ్మెట్‌లో రూ.1.51 లక్షలకు లడ్డూ దక్కించుకున్న సూరకంటి మురళీధర్‌రెడ్డి



హిందూ సేనా యూత్ అసోసియేషన్ మల్లెమెట్ ఆధ్వర్యంలో.. రూ.1.75 లక్షలకు లడ్డూను దక్కించుకున్న మధు ముదిరాజ్



హనుమాన్‌నగర్ ఫేజ్–3 వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను రూ.85 వేలకు దక్కించుకున్న డీసీఎం మహేశ్